క్లుప్తంగా

తుప్పల తొలగింపు



మండవల్లి: మండవల్లిలో నివాసాలు, రోడ్ల పక్కన పెరిగిన పొదలు, తుప్పలను సోమవారం సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దట్టమైన అడవి మాదిరిగా పెరిగిన తుప్పలు, చెట్ల వల్ల పురుగులు, పాములు చేరే అవకాశం ఉంటుందన్నారు. పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

రామ్మూర్తి జీవితం ఆదర్శనీయం



గుడివాడ టౌన్: విశ్వబ్రాహ్మణ జాతిపిత గాజాల రామ్మూర్తి జీవితం ఆదర్శనీయమని విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రామ్మూర్తి వర్ధంతి సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మద్రాసు శాసన మండలి సభ్యుడిగా ఉన్నప్పుడు విశ్వకర్మ సామాజికవర్గం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణంగా గుర్తించడం వలన ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందన్నారు. ఆ నేపథ్యంలో విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గానికి రిజర్వేషన్ సాధించి వారి జీవితాల్లో వెలుగు నింపారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వసుధ భసవేశ్వరరావు, సభ్యులు వై.కోటేశ్వరరావు, ఎ. పిచ్చేశ్వరరావు, రాజారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రసాదరాజు కుటుంబ సభ్యులకు పరామర్శ

కైకలూరు: కలిదిండి మండలం కొండూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టుముక్కల ప్రసాదరాజు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పరామర్శించారు. ప్రసాదరాజు తండ్రి గణపతిరాజు సోమవారం మృతి చెందారు. గణపతిరాజు అంతిమయాత్రలో డీఎన్నార్ పాల్గొని అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ అక్కడే ఉన్నారు. కార్యక్రమంలో కలిదిండి వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, తాడినాడ మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి చిన్నబ్బాయిరాజు, ముంద్రు చార్లెస్, అల్లూరి నరేష్ రాజు, కూసంపూడి యస్వంత్ వర్మ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

కైకలూరు: నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా స్వల్పకాలిక శిక్షణ అందించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంట సుధాకర్ సోమవారం తెలిపారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసిస్టెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి ఈ నెల 29 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఖాళీగా ఉన్న యువతీ యువకులను గుర్తించి వారికి హబ్‌ల్లో శిక్షణకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. వయస్సు 30 లోపు వారికి మూడు నెలల కోర్సును అందిస్తామన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ వర ప్రసాద్ 97013 57315, 62811 19575లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పెదపాలపర్రులో 'పదండి వెళ్దాం బడికి'



ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రులో పదండి వెళ్దాం బడికి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నేను బడికి పోతా బ్యానర్‌తో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బడి ఈడు గల పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ప్రభుత్వ పరంగా ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరించారు.

క్రియా యోగంతో రుగ్మతలు దూరం



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రుద్రరాజు శిరీష

పామర్రు: ఒక్క రూపాయ ఖర్చు లేకుండా క్రియా యోగం ద్వారా రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని సుషుమ్న క్రియా యోగం రాష్ట్రీయ ప్రచారక్ రుద్రరాజు శిరీష అన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సేవా భవన్‌లో సోమవారం దివ్య బాలాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్ గురు ఆత్మానందమయి అమ్మవారి ప్రేరణతో క్రియా యోగం శిక్షణ తరగతిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యాన యోగం విశిష్టతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రోజుకు ఒక అర్ధగంట ఎలా ధ్యానం చేయాలో తెలిపారు. ఓంకార నాదంతో శిక్షణ ఇచ్చారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీవీ అప్పారావు, పూర్వ లయన్స్ క్లబ్ ఆర్‌సీ కె.చంద్రశేఖర్‌రావు, ధ్యాన అనుభవ సాధకులు సూరపనేని చంద్రశేఖర్, సుషుమ్న ఫౌండేషన్ ధ్యాన ప్రచారకులు కోనేరు భాస్కరరావు, కోనేరు కమల, కాంచన శర్మ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు బైసాని నాగేశ్వరరావు, లంకపల్లి శ్రీనివాసరావు, తోట రమేష్, ఎం మధుసూధనరావు, కాకర్ల దుర్గా ప్రసాద్, బొప్పన స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం


నిమ్మకూరులో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి శాంతి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. తొలుత స్వామిని కల్యాణ మండపం పైకి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెరసెల్లా కట్టి అమ్మవార్లను కల్యాణ మండపంపైకి తీసుకొచ్చారు. సుమూహూర్తం, జీలకర్ర బెల్లం పెట్టించారు.

అనంతరం మాంగల్య ధారణ, అక్షతారోపణం, తలంబ్రాలు కార్య క్రమాలు నిర్వహించారు. పరాశరం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యుల మంత్రోచ్చరణతో కల్యాణోత్సవం రమణీయంగా నిర్వహించారు. పీటలపై కూర్చొన్న దంపతులకు తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ, ఒక ఉత్తరీయం, రవికలను దేవస్థానం వారు బహూకరించారు.

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

పమిడిముక్కల: వాతావరణ మార్పుల వల్ల గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ షేక్ మహమ్మద్ సుభానీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, హెల్త్ సూపర్‌వైజర్లకు జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. 15 రోజులకోసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలను వెంటనే సరిచేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ దగ్గర డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రెయిన్‌లు శుభ్రం చేసుకోవాలని, నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ బాల్స్ వదలాలని చెప్పారు. ప్రతి సోమ, శుక్ర వారాల్లో ఏఎన్ఎం, ఆశావర్కర్, కార్యదర్శి, సిబ్బందితో కలిసి వీధుల్లో తిరిగి టైర్లు, తొట్టెలు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శానిటేషన్ పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

పమిడిముక్కల: పమిడిముక్కల-3 అంగనవాడీ కేంద్రంలో సోమవారం డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా, ఏఎన్ఎం లక్ష్మి డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఓఆర్ఎస్ ద్రావణం తయారీని వివరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాజకీయాల్లో గెలుపోటములు సహజం. వైఎస్సార్ సీపీ నాయకులు ఎవరూ అధైర్యపడొద్దు.. అందరికీ అందుబాటులో ఉంటామని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఏలూరు రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆయనసోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవిస్తానన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు పొందిన కుటుంబాలన్నీ మనకే అండగా ఉన్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రయాణం మొదలుపెడదామని చెప్పారు. ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా పార్టీ పరంగా ముందుంటానని డీఎన్నార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బలే నాగరాజు, ఘంటసాల జగన్నాథం, జాజుల రాజు, ఘంటసాల రామారావు, ముంగర గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ముదినేపల్లి రూరల్ : స్థానికంగా ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ సోమవారం ప్రారంభించారు. స్థానికుడైన అబ్దుల్ కలాం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరైన వినోద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ముదినేపల్లి విద్యార్థికి ఐఐటీలో సీటు



ముదినేపల్లి రూరల్ : ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ముదినేపల్లికి చెందిన విద్యార్థి ప్రతిభ చూపి తిరుపతి ఐఐటీలో సీటు దక్కించుకున్నాడు. ముదినేపల్లికి చెందిన బండి ఇమ్మానియేలు కుమారుడైన విజయరాజు స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి ఉత్తీర్ణుడై అనంతరం కుంటుముక్కల ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణత సాధించాడు. ఈ ఏడాది జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విజయం సాధించి తిరుపతి ఐఐటీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.విజయకుమార్ గతంలో ఈ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేసిన ప్రభుదాస్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు విజయరాజు, తండ్రి ఇమ్మానియేలుకు అభినందనలు తెలిపారు.

ఘనంగా జగదాంబ సరస్వతీ స్మృతి దివస్



కైకలూరు: భారతదేశ ప్రజలకు ఆధ్యాత్మిక మార్గ నిర్దేశం చేసిన మతేశ్వరీ జగదాంబ సరస్వతీ స్మృతి దివస్‌ను స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు కేంద్ర నిర్వాహకురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ బ్రహ్మకుమారీల మొట్టమొదటి ప్రధాన నిర్వాహకురాలుగా ఆమె వ్యవహరించారన్నారు. ఆమె చేసిన ఆధ్యాత్మిక ప్రసంగాలు, బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా నాలుగు గంటలు యోగా సాధన చేశారు. రాజయోగ తపస్సు విశిష్టతను అందరికీ వివరించారు. అనంతరం భక్తులందరూ బ్రహ్మ భోజనం చేశారు. బ్రహ్మకుమారీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం


అయ్యప్పస్వామికి ప్రత్యేక అలంకారం

బంటుమిల్లి: స్థానిక శ్రీ అయ్యప్పస్వామి ఆలయ దశమ(10వ)వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, పంచామృతాలతో స్వామివారి ప్రధానమూర్తి, ఉత్సవమూర్తులకు శ్రీసూక్త, మన్యుసూక్త, దుర్గాసూక్తాలతో అభిషేకాలు కన్నుల పండువలా నిర్వహించారు. పండితులు డి.సుధీర్‌శర్మ వేద మంత్రాల మధ్య పలువురు దంపతుల దీక్షధారణలతో పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పురుషసూక్త సహిత రుద్రగాయత్రి హోమానికి పూర్ణాహుతి చేశారు. అనంతరం ప్రధాన మూర్తిని సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆవరణలోని గణపతిస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, మాలికా పురత్తమ్మదేవిల మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మేళతాళాలతో స్వామివారి ఉత్సవమూర్తి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇ.లీలాకృష్ణ, డి.రాంబాబు, సీతారామయ్య, జి. శ్రీనివాసరావు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ముదినేపల్లి రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో సోమవారం నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభమైనట్లు ఎంపీడీఓ గంగాధరరావు తెలిపారు. ఈ తనిఖీలు వచ్చే నెల మూడో తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయా గ్రామాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను పరిశీలిస్తారన్నారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీల వివరాలు, వేతనాలు పని దినాలు, మెటీరియల్ కాంపోనెంట్ చెల్లించిన వేతనాలకు సంబంధించి క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలి

మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో జూలై ఒకటో తేదీ నుంచి గ్రామసభలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జేవీఎస్ సుభానిని సోమవారం ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కర రావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, కార్యవర్గ సభ్యుడు బి.రంగారావు తదితరులు కోరారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు.

ఆర్‌బీకే ఉద్యోగులు రైతులకు అందుబాటులో ఉండాలి



మండవల్లి: రైతులకు వీఏఏలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, ఏడీఏ సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీఏఏలకు కేటాయించిన మట్టి నమూనాలను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా మాట్లాడుతూ రైతులు సాగుకు ముందు వరి విత్తనాలను తప్పనిసరిగా శుద్ధి చేయాలన్నారు. దీని ద్వారా నెల రోజుల వరకు వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు.

కొప్పుల వెలమ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



ముదినేపల్లి రూరల్ : మండల కొప్పుల వెలమ సంఘం అధ్యక్షుడిగా రెడ్డి నాగరాజు నియమితులయ్యారు. సంఘ అధ్యక్ష ఎన్నికల నాయకుడు గంగునేని వరప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రొద్దువాకలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా నాగరాజుతో పాటు ప్రధాన కార్యదర్శిగా గునుపూడి నాగరాజు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో కొప్పుల వెలమల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా కులస్తులకు అందాల్సిన రా యితీలను స్థానిక నాయకుల సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికై న కార్యవర్గాన్ని సంఘ నాయకులు సత్కరించారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ నారాయణ

గుడివాడ టౌన్: పట్టణంలో ఘన, వ్యర్థ పదార్థాల వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జి. బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ బి. లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా వాటి తరలింపు, ప్రస్తుత పురపాలక సంఘంలో పరిస్థితులు, మున్సిపల్ కంపోస్టులో నిల్వల తరలింపు వంటి పలు అంశాలపై న్యాయమూర్తి సమీక్ష నిర్వహించారన్నారు. సమీక్ష నివేదికను న్యాయమూర్తి లక్ష్మీ నారాయణ జిల్లా అధికారులకు నివేదిస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న అన్ని సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, భూ సేకరణ వంటి ప్రధాన అంశాలపై సమీక్షించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఎంఈ బి.విజయదుర్గ , డీఈ ప్రవీణ్‌కుమార్, మండల న్యాయ సేవా సాధికారక కమిటీ వైస్ చైర్మన్ పి. అజయ్‌బాబు, న్యాయవాదులు సీహెచ్ కుటుంబరావు, లక్ష్మీనారాయణ, వర సౌదామణి, కె. రాంబాబు, పి. రవికుమార్, విమల పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


మాజీ ఎమ్మెల్యే డీవై దాసు

పామర్రు: తెలంగాణ తరహాలో ఏపీలో రైతులకు రుణమాఫీ అమలు చేసి రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డీవై దాసు పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అక్కడి రైతులకు తాజాగా రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. అదే తరహాలో ఏపీలోనూ కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఖరీఫ్‌లో సరైన పంటలు పండక ఏపీ రైతులు నష్టాల బారిన పడ్డారన్నారు. గడచిన ఐదేళ్లలో అనేక ఆటుపోటుకు గురై అన్నదాతలు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయారని, వారిపట్ల ప్రభుత్వం కనికరం చూపాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్త శుద్ధితో పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని రైతులకు న్యాయంచేస్తున్నారన్నారు. అదే తరహాలో ఏపీ ప్రభుత్వం పునరాలోచన చేసి ఇక్కడ రైతులకు రుణమాఫీ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కలిసి సముచిత నిర్ణయం తీసుకుని రైతులను కాపాడాలని ఆశిస్తున్నామని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై శిక్షణ అవసరం


మాట్లాడుతున్న ఏడీఎఫ్ఓ ఆంజనేయులు

గుడివాడ టౌన్: ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై శిక్షణ అవసరమని అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ జె.ఆంజనేయులు అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్లో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందికి సోమవారం అగ్నిప్రమాదాలు, వాటి నివారణపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులలో రోజురోజుకు పెరుగుతున్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. కొన్ని విభాగాలు ఐసీయూ, ఎమర్జెన్సీ యూనిట్‌లతో పాటు కొన్ని ఏసీ వార్డులు వంటివి వినియోగంలోకి రావడంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. దీని కారణంగా షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉన్నప్పటికీ వాటిని ఏ విధంగా వినియోగించాలి అనే దానిపై కొంత శిక్షణ ఇస్తే ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రిలోనే సిబ్బంది ఉంటారు కనుక తక్షణ చర్యలు తీసుకుంటే ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. ప్రమాద స్థాయి తగ్గించినా ఫైర్ సిబ్బంది దానిని పూర్తిగా అదుపు చేస్తారన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని మూడు రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ముందు రోజు మౌఖిక శిక్షణ, అనంతరం ప్రయోగాత్మకంగా వారికి తర్ఫీదు ఇస్తామన్నారు. ముగింపు రోజున శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల


ఐలూరులో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల ఆరోగ్యవంతంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని ఐలూరు అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించటంతో పాటు చదువు, ఆటలు, పాటలు నేర్పించనున్నట్లు తెలిపారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకోవటంతోపాటు ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పాఠశాలలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు ధనలక్ష్మి, లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమామహేశ్వరి, శారద, ఎంఎల్‌హెచ్‌పీ రత్నశ్రీ, ఏఎన్ఎం నాగరాణి, ఆశా కార్యకర్త సీతారత్నం పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ


గొడుగులు పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు గొడుగులు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. స్థానిక ఓల్డ్ టౌన్-2 మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. సేవా సంఘం రాష్ట్ర సభ్యుడు పులిపాక రామ్మోహనరావు వితరణతో చిన్నారులకు గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో చిన్నారులు ఇబ్బంది పడకుండా గొడుగులు పంపిణీ చేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, సయ్యద్ గఫార్, పీవీ నాగబాబు, కె. హరిబాబు, జె. తాతారావు, లింగం ప్రసాద్ పాల్గొన్నారు.

కక్ష సాధింపు వద్దు.. అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం


సీఎన్నార్ గార్డెన్‌లో ఎన్‌డీఏ సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కక్ష సాధింపు పద్ధతులను విడిచిపెట్టి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీఎన్నార్ గార్డెన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు కృతజ్ఞతా సమావేశం సోమవారం నిర్వహించారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి కూటమి నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కామినేని మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. నాలుగు మండలాల్లో ఎన్‌డీఏ పేరుతో కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు స్పందించిన ముదినేపల్లికి చెందిన బొర్రా చలమయ్య రూ.6 లక్షలు విరాళం కామినేనికి అందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వీరమల్లు నరసింహారావు, పెన్మత్స త్రినాథరాజు, కొల్లి బాబి, వేంపాటి విష్ణురావు, బలే ఏసురాజు, తేరా రమేష్, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, వీరాబత్తిన సుధా, కురేళ్ళ బేబీ, పైడిపాటి శివశంకర్, పూలా రాజీ, జానీ, ఉస్మాన్, కేకే బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించండి

కైకలూరు: నియోజకవర్గంలో నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల కలిదిండి మండలం పెదకొమ్ములేరుపై వంతెన కూలిపోవడంపై చర్చించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తాడినాడ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాస్త్రీ, ఏఈ కృష్ణారావు, ఆర్‌అండ్‌బీ డీఈ విజయశ్రీకార్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ కోడూరు మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు

కోడూరు: పీఆర్టీయూ కోడూరు మండల శాఖ అధ్యక్షుడిగా విస్సంశెట్టి రామాంజనేయులను యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దీన్ని సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలకు అందించారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు, కార్యదర్శిగా వి.వి.రాజారవి వర్మతో పాటు సభ్యులను తీర్మానించి, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాబ్జి వీరికి నియామక పత్రాలు అందించారు. విద్య, పాఠశాల సంబంధ సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందని బాబ్జి తెలిపారు. అనంతరం విద్యా సంవత్సర యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.